### • నల్లగొండలో ఒలింపిక్ రన్



నల్లగొండ రూరల్, జూన్ 22: నల్లగొండ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి ప్రారంభమైన ఒలింపిక్ రన్ ఇండోర్ స్టేడియం వద్ద ముగిసింది. ఒలింపిక్ సంఘం చైర్మన్ హాఫీజ్ ఖాన్ రన్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల సంక్షేమానికి మా సంఘం అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు.

### నాట్య మయూరాలు

రాయగిరి గ్రామ పరిధిలోని మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం నిశృంఖల డాన్స్ అకాడమీ నాట్య గురువు సంధ్యరాజు శిష్య బృందం హైదరాబాద్ ఆధ్వర్యంలో రమ్య, శ్రీయ వర్మ, వల్లి, గౌతమి, రోజా కళాకారులు చక్కని ప్రదర్శనతో అలరించారు.

- భువనగిరి కలెక్టరేట్





# వాసాలమర్రి.. పట్టాల వర్రీ..!

## ప్రకటనలకే ఇందిరమ్మ ఇండ్లు పరిమితం • ఇండ్ల కోసం 560 మంది దరఖాస్తు

227 మందికి ఇస్తామంటూ ప్రభుత్వం ప్రగల్భాలు • ఇప్పటి వరకు ఇచ్చింది పదిహేను మందికే

మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల ప్రచార ఆర్భాటం • జాబితాలో పేర్లున్నాయో లేదోనని గ్రామస్తుల ఆందోళన




'పేదల కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నది. రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు కట్టివ్వాలని నిర్ణయించింది. వాసాలమర్రిలో ఒక్క ఇల్లు కూడా కట్టకుండా మోసం చేశారు. గ్రామానికి 227 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం' ఇవీ ఈ నెల 19న వాసాలమర్రి పర్యటన సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది.

యాదాద్రి భువనగిరి, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రకటనలకే పరిమితమైంది. ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ ఆచరణకు నోచుకోవడం లేదు. ఎంతో చేశామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నా క్షేత్రస్థాయిలో విచిత్ర పరిస్థితులు కనిపిస్తున్నాయి. సరిగ్గా పట్టుమని పదిహేను మందికి కూడా ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వకుండా అంతా అయిపోయిందన్నట్లు కాంగ్రెస్ సర్కారు కలరింగ్ ఇవ్వడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### 227 మందికే మంజూరు

బీఆర్ఎస్ హయాంలో వాసాలమర్రిని కేసీఆర్ దత్తత తీసుకున్నారు. గ్రామంలో కొత్తగా 481 ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. అందులో భాగంగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పెండింగ్‌లో పడింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరుతో పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించింది. వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 560 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల పేరుతో అర్హుల జాబితాను 180 మందికి తగ్గించినట్లు తెలిసింది. తర్వాత పలువురు కాంగ్రెస్ నేతలు తమ వారి కోసం మరికొన్ని పేర్లను ప్రతిపాదించడంతో ఆ సంఖ్య 227కి పెరిగినట్లు సమాచారం.

#### పదిహేను మందికే పట్టాల పంపిణీ

ఇటీవల ఇదే మండలంలోని తిమ్మాపూర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో వాసాలమర్రి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామంటూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో హడావుడిగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీకి ప్లాన్ చేశారు. అనేక చోట్ల పంపిణీకి సిద్ధంగా ఉన్నా.. వాసాలమర్రి గ్రామాన్నే ఎంచుకున్నారు. ఈ నెల 19న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రప్పించి ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కోసం సభ ఏర్పాటు చేశారు. కేవలం 15 మందికే పంపిణీ చేశారు. మిగతావారికి మొండిచెయ్యి చూపించారు. తమకెప్పుడు ఇస్తారని అక్కడున్న వాళ్లు ప్రశ్నించగా.. మంత్రి వెళ్లగానే అందరికీ ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తామని సమాధానమిచ్చారు. కొందరికేమో ఇంటికే తెచ్చిస్తామని, వెళ్లిపోవాలని సూచించారు. ఇప్పటికి నాలుగు రోజులు గడుస్తున్నా పట్టాలు మాత్రం రాలేదు.

#### జాబితాలో ఉన్నదెవరో..?

ప్రభుత్వానికి, అధికారులకు ఓ ఇబ్బంది అడ్డం వచ్చినట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల కోసం 560 మంది దరఖాస్తు చేసుకుంటే 227 మందికి మాత్రమే ఇవ్వడంతో అంతా సస్పెన్స్‌గా మారింది. అధికారులు ఇప్పటి వరకు జాబితాను విడుదల చేయలేదు. తమకు రాకపోతే లొల్లి చేస్తారనే ఉద్దేశంతో మంత్రి కార్యక్రమంలో పరిమిత సంఖ్యలో ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పుడు జాబితాలో ఎవరెవరి పేర్లు ఉన్నాయో అర్థంకాని పరిస్థితి. పేర్లు బయటకు వస్తే మిగతా వారు రచ్చ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతానికి మాత్రం తమ పేర్లు ఉండొచ్చని ఆశాభావంతో అంతా సైలెంట్‌గా ఉన్నట్లు తెలుస్తున్నది. 'కొన్నిచోట్ల ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలకు కూడా ఇచ్చారట. కాంగ్రెసోళ్లు అనర్హులను కూడా జాబితాలో పెట్టారట. మాకెందుకు ఇవ్వరు?' అంటూ గ్రామంలో ఇప్పుడు దీనిపైనే విస్తృత ప్రచారం జరుగుతోంది. మరోవైపు అధికారులు మాత్రం సోమవారం నుంచి కొంత మందికి పట్టాలు ఇస్తామని చెబుతుండటం కొసమెరుపు.

## తెలంగాణకు.. కాంగ్రెస్, టీడీపీ ద్రోహం

- నాడు వైఎస్సార్ కృష్ణానది నీళ్లు మళ్లిస్తే..
- నేడు చంద్రబాబు రూపంలో మరో జల దోపిడీ
- కట్టడి చేయడానికి కేసీఆర్ మరో ఉద్యమం చెయ్యాలె!
- లేకుంటే రాష్ట్రంలో జల దోపిడీని ఆపలేం
- సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఘాటు విమర్శ



సూర్యాపేట, జూన్ 22(నమస్తేతెలంగాణ) : బనకచర్ల ప్రాజెక్టుకు వత్తాసు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, తెలుగుదేశం రెండూ తెలంగాణాకు ద్రోహం చేసిన పార్టీలే అని అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృష్ణానది నీళ్లను దోచుకెళ్లారు. నేడు ఏపీ సీఎం చంద్రబాబు రూపంలో మరోసారి తెలంగాణ జల దోపిడీకి గురవుతోంది. ఆ రెండు పార్టీల కలయికతో పుట్టిన హైబ్రిడ్ కలుపు మొక్క రేవంత్‌రెడ్డి. అలాంటి వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉండడం మన దురదృష్టం' అని అన్నారు. తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రలో కలిపింది.. ఆనాడు వందలాది మందిని బలిగొన్నది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన విమర్శించారు. 'కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే క్రమంలో ఆనాడు అడ్డుపడ్డది చంద్రబాబే. తెలంగాణాలో వలసలు, కరువు కాటకాలు, ఆకలి చావులకు కారణమైంది టీడీపీ, కాంగ్రెస్సే. తెలంగాణ ప్రజలు మళ్లీ కరువు కోరల్లో చిక్కుకునేలా రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. నదులు ఎక్కడున్నాయో తెలియని రేవంత్‌రెడ్డి ఇక్కడ దేనినైనా అమ్మేందుకు వెనుకాడట్లేదు. తన స్వార్థం కోసం ఎంతటి దుర్మార్గానికైనా దిగజారుతున్న నాయకుడు రేవంత్‌రెడ్డి' అని అన్నారు. కృష్ణానది ఎప్పుడో ఆంధ్రార్పణం అయిందన్నారు. 350 టీఎంసీల ప్రాజెక్టును కట్టి రాజశేఖర్‌రెడ్డి దుర్మార్గంగా కృష్ణానది నీటిని తీసుకుపోతుంటే ఆనాటి కాంగ్రెస్, టీడీపీ నాయకులు నోరు మెదపలేదన్నారు. ఈనాడు గోదావరి నీటిని కూడా దోచుకుపోతుంటే రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండీ నోరు మెదపలేని దుస్థితి నెలకొందన్నారు. మన నీళ్లు మనం వాడుకోవడానికి చంద్రబాబు అనుమతి అవసరమా అని ప్రశ్నించారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్‌రెడ్డి తెలంగాణ మొత్తం దోచుకుపోయినా స్పందించడన్నారు. ఈ దారుణాన్ని బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ సహించరని, కేసీఆర్ మరో ఉద్యమం చేస్తే తప్ప జల దోపిడీని ఆపలేమన్నారు. కేసీఆర్ పెట్టిన ఒక్క సభతో కాంగ్రెస్‌లో వణుకు మొదలైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రాకు అమ్ముతుంటే కేసీఆర్ చూస్తూ కూర్చోరని అన్నారు. మోదీ, చంద్రబాబు, రేవంత్ కుట్రలను తిప్పి కొట్టి తెలంగాణ హక్కులను కాపాడడంలో బీఆర్ఎస్ ముందుంటుందన్నారు. కేసీఆర్ ఉండగా తెలంగాణ ప్రజలకు నష్టం కలగనివ్వడని, ప్రజలందరినీ ఐక్యం చేసి రాష్ట్ర సాధన ఉద్యమాన్ని తలపించేలా మరో పోరాటం తప్పదన్నారు. తెలంగాణను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఉన్నారని, రేవంత్ నాటకాన్ని.. చంద్రబాబు ద్రోహాన్ని బయట పెట్టి తెలంగాణ హక్కుల్ని కాపాడుకుంటామని అన్నారు. బండి సంజయ్, రేవంత్‌రెడ్డి వీరంతా తెలంగాణ ద్రోహులేనని, వీరిలో ఏ ఒక్కరికీ తెలంగాణ పట్ల సోయి లేదని అన్నారు. బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే వారు రిటర్న్ గిఫ్ట్ కింద బనకచర్ల రూపంలో చంద్రబాబుకు గోదావరి నీటిని దోచి పెట్టారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు పదవుల సోయి తప్ప తెలంగాణ ప్రజలపై ఏ మాత్రం చిత్తశుద్ధిలేదన్నారు. కేసీఆర్‌ను జైల్లో పెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ ఒకర్ని మించి మరొకరు పోటీ పడుతున్నారని, ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను జైల్లో పెట్టడం ఎవరి తరం కాదన్నారు. ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



నకిరేకల్ : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న గృహనిర్మాణశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

## తెలంగాణ ప్రభుత్వానికి అప్పు పుట్టని మాట వాస్తవమే

### నకిరేకల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నకిరేకల్, జూన్ 22 : రాష్ట్ర ప్రభుత్వానికి అప్పు పుట్టని మాట వాస్తవమేనని, తల తాకట్టు పెట్టయినా మూడున్నరేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని, ఆ తరువాతే ప్రతి ఇంటికీ వచ్చి ఓట్లు అడుగుతామని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శపథం చేశారు. ఆదివారం నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని మినీస్టేడియంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇండ్లు, మూడున్నర ఏళ్లల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వడానికి అవసరమైతే నిబంధనలు సడలించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో రాజకీయ జోక్యం లేదన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నకిరేకల్, రామన్నపేట మండలాలకు తహసీల్దార్ కార్యాలయాల భవనాలు మంజూరు చేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెలికంటి సత్యం, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్, మందుల సామేల్, శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జెడ్పీసీ ఈవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్ జమీరొద్దీన్, ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# భలే మంచి ఇసుక బేరం!

## ఆన్‌లైన్‌లో ఇసుక విధానంతో ఖజానా గలగల • వినియోగదారుడి జేబు గుల్ల

- ఇదీ సూర్యాపేట జిల్లాలో ఇసుక విధానం
- ఏడు నెలల్లో ప్రభుత్వానికి ఆదాయం రూ.10 వేల కోట్లు
- గతంలో ట్రాక్టర్ ధర రూ.3,600
- నేడు రూ.5 వేలకు పెరిగిన వైనం
- ధర తగ్గించాలంటున్న గృహ నిర్మాణదారులు



సూర్యాపేట, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : ఇసుక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా గత ఏడు నెలల కాలంలో ప్రభుత్వానికి సుమారు రూ.10 వేల కోట్ల వరకు ఆదాయం లభించగా సామాన్యుడికి మాత్రం నడ్డి విరుగుతోంది. గతంలో ఇసుక వ్యాపారులు ఈ దందాను నడిపించగా నేడు ప్రభుత్వమే వ్యాపారం చేస్తున్నది. గతంలో జాజిరెడ్డిగూడెం రీచ్ నుంచి సూర్యాపేటకు ఒక్కో ట్రాక్టర్ రూ.3,200 నుంచి రూ.3,500లకు లభించేది. ప్రభుత్వం జిల్లాలో ఆరు రీచ్‌లను గుర్తించి ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టిన తరువాత దూరాన్ని బట్టి రూ. రూ.4,500 నుంచి రూ.4,900 పలుకుతుండగా డ్రైవర్ బత్తాతో కలిపి దాదాపు రూ.5 వేలకు చేరుకుంటోందని పలువురు నిర్మాణ దారులు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక సారి ఇసుకాసురులు సిండికేట్‌గా మారి ఇసుక ధరలను అమాంతం పెంచగా నిర్మాణ భారం అవుతుందని గుర్తించిన నాటి మంత్రి, ప్రస్తుత సూర్యాపేట ఎమ్మెల్యే వెంటనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఇసుక ధరలు పెంచితే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేసి వెంటనే ధరలు తగ్గించారు.

#### ఇసుక ధరలు పైపైకి..

ఇసుక... ఇది ప్రకృతి పరంగా సహజ సిద్ధంగా దొరికే ఖనిజం. మనిషి అవసరాలను ఆసరాగా తీసుకున్న కొంతమంది కక్కుర్తితో రోజురోజుకు ఇసుక ధరలు పెరుగుతూ వస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం వరకు సూర్యాపేట పరిసర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రాగా.. నాడు ఒక్కో ట్రాక్టర్ రూ.1,500 నుంచి రూ.1,800 వరకు పలికేది. అలాంటిది నేడు ఇసుక వ్యాపారం ప్రభుత్వం చేతికి చేరి ట్రాక్టర్ ఒక్కంటికి రూ.5 వేలకు చేరుకోవడం గమనార్హం. ఇసుక వ్యాపారులు ధరలు పెంచుతూ పోవడం ఒక ఎత్తయితే.. ఏకంగా ఆదాయం కోసం ఇసుకాసురులను కట్టడి చేయడంలో సక్సెస్ అయిన ప్రభుత్వం ఇసుక ధరలను మరింత పెంచి తన ఆదాయం పెంచుకుంటూ సామాన్యులపై భారం పెడుతోంది. జిల్లాలో జాజిరెడ్డిగూడెం, తాటిపాముల, పేరబోయినగూడెం, నందాపురం, కొత్తగూడెం, బిక్కుమళ్ల మొత్తం ఆరు రీచ్‌లను గుర్తించి ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది. మరో పక్క అనధికార ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టింది. ఇలా అరికట్టడం ద్వారా ఇసుక ధరలు తగ్గుతాయని అనుకుంటే ధరలు పెరగడమే కాకుండా ఒక ట్రాక్టర్ ఇసుక కావాలంటే కనీసం 15 రోజుల సమయం పడుతోందని పలువురు భవన నిర్మాణదారులు వాపోతున్నారు.

#### భారంగా ఆన్‌లైన్ విధానం


జిల్లాలో ఇసుక ఆన్‌లైన్ విధానంలోకి వచ్చిన తరువాత ధరలు పెరిగి నిర్మాణదారులకు భారంగా మారింది. అది కూడా ఆన్‌లైన్‌లో బుక్ చేసిన తరువాత కనీసం 15 రోజులకు ఇసుక రవాణా అవుతుందని చెబుతున్నారు. వాస్తవానికి మూడేళ్ల క్రితం వరకు సూర్యాపేట పరిసర ప్రాంతాల నుంచి అనధికారికంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఒక్కంటికి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు లభించగా జాజిరెడ్డిగూడెం రీచ్ నుంచి మాత్రం రూ.3,200 నుంచి రూ.3,500లకు లభించేది. నేడు అనధికార ఇసుకను పూర్తిగా కట్టడి చేసి ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టడంతో అధికారిక రీచ్‌ల నుంచి సూర్యాపేటకు రూ.4,500 నుంచి రూ.4,900 పలుకుతుండగా డ్రైవర్ బత్తా వసూలు చేస్తుండడంతో రూ.5 వేల వరకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అక్రమార్కులు ఇప్పటి కూడా లారీల ద్వారా ఇసుక బుక్ చేసి నిర్మాణం జరుగుతున్న ఇళ్ల వద్ద డంప్ చేసి డిమాండ్‌ను బట్టి ఇసుక ట్రాక్టర్‌కు రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. నేడు సామాన్యుడు 200 గజాల్లో ఒక ఇల్లు నిర్మాణం చేపట్టాలంటే రూ.60 వేల వరకు ఇసుకకే వెచ్చించే పరిస్థితి దాపురించింది. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టిన గత ఎనమిది నెలల కాలంలో ప్రభుత్వానికి దాదాపు రూ.10 వేల కోట్ల ఆదాయం లభించింది. ఆదాయం గణనీయంగా పెరగడం మంచి పరిణామమే అయినప్పటికీ కొంతమేర ధర తగ్గించి సామాన్యుడికి అందివ్వాలని, అలాగే బుక్ చేసిన మరుసటి రోజే ఇసుక వచ్చేలా చర్యలు చేపట్టాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

#### నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలి



ఆన్‌లైన్ విధానంతో అధికారిక రీచ్‌ల నుంచి ఎలాంటి దళారులు లేకుండా నేరుగా మంచి ఇసుక లభిస్తోంది. కాకపోతే రెండేళ్ల క్రితంతో పోలిస్తే ధర గణనీయంగా పెరిగింది. చిన్న ఇండ్లు నిర్మించుకునే మధ్యతరగతి వర్గాలకు ఒక్కో ఇంటికి గతంలో ఇసుక కోసం దాదాపు రూ.60 నుంచి రూ.65 వేలల్లో పూర్తయ్యేది. నేడు రూ.లక్ష నుంచి రూ.లక్ష యాభైవేలు అవుతోంది. ధరలు తగ్గిస్తే.. నిర్మాణ భారం తగ్గుతుంది.

- చంద్రారెడ్డి, భవన నిర్మాణదారుడు



ఎర్రోజు రాజు, సత్యనారాయణ(ఫైల్)

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

బీబీనగర్, జూన్ 22 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందిన సంఘటన ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆదివారం జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలో చోటు చేసుకుంది. సీఐ ప్రభాకర్‌రెడ్డి కథనం ప్రకారం... భువనగిరి పట్టణానికి చెందిన ఎర్రోజు రాజు (42), మోత్కూరు మండలం తిరుమలగిరికి చెందిన తంగళ్లపల్లి సత్యనారాయణ(50) శనివారం ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరి బైక్ గూడూరు టోల్ ప్లాజా వద్ద ముందుగా వెళుతున్న కారును ఢీకొట్టింది. ఆ ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వీరిని దవాఖానకు తరలిస్తుండగా ఎర్రోజు రాజు మార్గం మధ్యలో మృతి చెందాడు. తంగళ్లపల్లి సత్యనారాయణ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

**మిర్యాలగూడ:** స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మిర్యాలగూడలో జరిగింది. వన్ టౌన్ సీఐ సీహెచ్ మోతీరాం కథనం ప్రకారం... పాలకీడు మండలం శూన్యంపహాడ్‌కు చెందిన గంధం అరుణ్(25), రామకృష్ణలు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉంటున్నారు. వీరిద్దరు ఆదివారం స్కూటీపై మిర్యాలగూడ నుంచి హాలియా వైపు వెళ్తుండగా లోడ్‌తో వెళ్తున్న వడ్ల లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. స్కూటీపై వెనుక కూర్చొన్న అరుణ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రామకృష్ణను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.